
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 28 ఏప్రిల్ 2025



చందనోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సింహాచలం నృసింహ స్వామి ఆలయంలో ఈనెల 30న జరిగే చందనోత్సవానికి జిల్లా కేంద్రం విజయనగరం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రజా రవాణాధికారి అప్పలనారాయణ ఆదివారం తెలిపారు. రెగ్యులర్ బస్సులతో పాటు అదనంగా మరో 15 బస్సులు నడపనున్నట్లు చెప్పారు. 30న వేకువజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ నడుస్తాయన్నారు. అవసరమైతే మరో 10 ఆర్టీసీ బస్సులు వేస్తామన్నారు. జిల్లాకు చెందిన భక్తులు ఈ విషయాన్ని గమనించి వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొత్త పింఛన్లు వస్తున్నాయ్

- జిల్లాలో 4,800 మంది వితంతువులకు లబ్ధి
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- కరుణించిన ప్రస్తుత ప్రభుత్వం
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- మే 1న పంపిణీకి సన్నద్ధం



- రాజాం మండలం కంచరాం గ్రామానికి లక్ష్మణరావు ఏడాదిన్నర కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. కానీ, ఆయన భార్య **లక్ష్మి**కి ఇంతవరకు వితంతు పింఛన్ మంజూరు కాలేదు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం శూన్యం.
- రాజాం వస్త్రపురి కాలనీకి చెందిన అనెం సూర్యారావు కొద్ది నెలల కిందట చనిపోయారు. ఆయన భార్య **సరస్వతి** భర్త మరణ ధ్రువీకరణపత్రంతో పాటు అన్నిరకాల సర్టిఫికెట్లను జతచేసి దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు ఆమెకు వితంతు పింఛన్ మంజూరు కాలేదు. అధికారులను అడుగుతుంటే ప్రభుత్వం నుంచి అనుమతి లేదని సమాధానం వస్తోంది.

రాజాం/సంతకవిటి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి)

ఇటువంటి వారికి గుడ్ న్యూస్ చెప్పింది కూటమి ప్రభుత్వం. వితంతువులకు సంబంధించి కొత్త పింఛన్లు మంజూరుకానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. భర్త చనిపోయిన వారికి ముందుగా పింఛన్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ నెల 30లోగా అన్ని వివరాలు సమగ్రంగా అందిస్తే మే 1న వారికి



- సంతకవిటి మండలం మోదుగులపేటకు చెందిన శాసపు అప్పన్న మరణించి 18 నెలలు అవుతుంది. ఆయన భార్య **భాగమ్మ** మాత్రం వితంతు పింఛన్‌కు నోచుకోవడం లేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారని ఆమె వాపోతుంది.



- సంతకవిటి మండల కేంద్రానికి చెందిన గెడ్డాపు **వజ్రం** వితంతు మహిళ. భర్త గెడ్డాపు తవిటయ్య మరణించి 17 నెలలు అవుతుంది. వితంతు పింఛన్ మంజూరు చేయాలని సంతకవిటి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పింఛన్ మంజూరు కాలేదు. భర్త మరణించడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి దరఖాస్తు చేసింది.



- సంతకవిటి మండల కేంద్రానికి చెందిన పొదిలాపు దామోదరరావు 18 నెలల కిందట మృతిచెందాడు. ఆయన భార్య **నాగలక్ష్మి**కి ఇప్పటి వరకు వితంతు పింఛన్ అందలేదు. కూటమి ప్రభుత్వం తన దరఖాస్తును పరిశీలించి వితంతు పింఛన్ మంజూరు చేస్తుందని గంపెడాశతో ఎదురుచూస్తుంది.

కొత్త పింఛన్లు అందనున్నాయి. గత కొన్ని నెలలుగా వితంతువులకు సంబంధించి పింఛన్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 89,877 కొత్త పింఛన్లను అందించాలని నిర్ణయించగా.. జిల్లాలో 4,800 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే ప్రతినెలా సామాజిక పింఛన్ల కింద 2,72,904 మందికి పింఛన్లు అందుతున్నాయి. ప్రతినెలా రూ.115.93 కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తోంది. కొత్త వితంతు పింఛన్లతో ప్రభుత్వంపై దాదాపు రూ.1.92 కోట్ల భారం పడనుంది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరంతర ప్రక్రియ..

టీడీపీ ప్రభుత్వ హయాంలో వితంతు పింఛన్ల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగేది. ఎవరైనా భర్త చనిపోతే అదే వారంలో అప్పట్లో వివరాలు నమోదు చేసేవారు. నెల చివర్లో అధికారులకు నివేదిక అందేది. వెంటనే వారు ధ్రువీకరిస్తూ భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేసేవారు. 2019 ఏప్రిల్ వరకూ ఇలానే కొనసాగింది. కానీ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఆనవాయితీకి బ్రేక్ వేసింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇటువంటి దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని పింఛన్లు మంజూరు చేసింది. వైసీపీ అధికారంలో ఉన్న చివరి రెండు సంవత్సరాల్లో ఒక్కసారి మాత్రమే వితంతు పింఛన్లు మంజూరు చేసింది. అది కూడా 2024 ఎన్నికలకు కొద్దిరోజులు ముందు మాత్రమే అందించింది. అయితే గత ఏడాదిగా వితంతు పింఛన్ల మంజూరు జరగలేదు. మధ్యలో మాత్రం ఏ నెలకు ఆ నెల స్పౌజ్ కింద వెంటనే భర్త పింఛన్‌ను వితంతువుకు బదలాయించింది. అయితే రాష్ట్రంలో ఏడాదికి పైగా పెండింగ్‌లో 89 వేలకుపైగా దరఖాస్తులు ఉండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో దరఖాస్తు చేసుకొని ఈ నెల 30లోగా వివరాలు సక్రమంగా అందిస్తే మాత్రం పింఛన్ వెను వెంటనే మంజూరు అవుతుంది. మే1న పింఛన్ మొత్తం అందిస్తారు. లేకుంటే మాత్రం జూన్ 1న కొత్త వితంతు పింఛన్ అందించే ఏర్పాట్లు చేస్తారు.


మా సంగతేంటి?

గత వైసీపీ ప్రభుత్వం 2023 జూలై 1వ తేదీ నుంచి 2023 నవంబరు 30వరకు దరఖాస్తు చేసుకున్న వితంతువులకు పింఛన్ మంజూరు చేయకుండా మొండిచేయి చూపించింది. ఈ విషయమై ప్రస్తుత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం 2023 డిసెంబరు 1వ తేదీ నుంచి 2024 అక్టోబరు 30 వరకు ఉన్న స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసేలా మౌఖిక ఉత్తర్వులు విడుదల చేసింది. మరి తమ పరిస్థితి ఏంటి అని 2023 జూలై 1వ తేదీ నుంచి 2023 నవంబరు 30వరకు దరఖాస్తు చేసుకున్న **(మిగతా 8వ పేజీలో..)**

ఇంకా అవే పేర్లు

- హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలపై మాజీ సీఎం జగన్ ఫొటో, వైఎస్ఆర్ పేరు
- రైతు సేవా కేంద్రాలుగా మారని ఆర్‌బీకేలు
- ప్రభుత్వ ఆదేశాల అమల్లో నిర్లక్ష్యం

గజపతినగరం ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుంది. అయినా, గత వైసీపీ ప్రభుత్వ ఆనవాలు ఇంకా పోవడం లేదు. జగన్ పాలనలో ఆయన పేరు, ఆయన తండ్రి వైఎస్ఆర్ పేరుతో పథకాలను అమలు చేసేవారు. అలాగే, ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేసి వాటిపై వైఎస్ఆర్, జగన్ పేర్లు రాసి బొమ్మలను అతికించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు.. వైఎస్ఆర్ విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లను నిర్మించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైఎస్ఆర్ పేరుని తొలగించి విలేజ్ హెల్త్ క్లీనిక్‌గా మార్పు చేసింది. అలాగే, రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. కానీ, గజపతినగరం మండలంలో చాలాచోట్ల ప్రభుత్వ భవనాలకు ఇంకా పాతపేర్లు, వైసీపీ



మధుపాడలో మారని రైతు భరోసా కేంద్రం పేరు



ఎం.కొత్తవలసలో విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనంపై ఉన్న జగన్ ఫొటో, వైఎస్ఆర్ పేరు

రంగులే కనిపిస్తున్నాయి. మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో 21గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. మరుపల్లి, ముచ్చర్ల, మధుపాడ, ఎం.కొత్తవలస తదితర గ్రామాల్లో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అయితే 18 భవనాలపై ఉన్న వైఎస్ఆర్ పేరును నేటికీ అధికారులు తొలగించలేదు. అదే విధంగా 20 రైతు భరోసా కేంద్రాలు ఉండగా వాటిని రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చాల్సి ఉంది. కానీ, నేటికీ అవి రైతు భరోసా కేంద్రాలుగానే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా భవనాలపై పేర్ల మార్పుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

- వేసవి కావడమే ప్రధాన కారణం
- ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను అధికంగా వాడుతున్న ప్రజలు



విజయనగరం రింగురోడ్డు ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వినియోగం పెరుగుతుంది. నివాస గృహాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఇలా అన్నింటిలోనూ వినియోగం పెరుగుతుంది. సాధారణ రోజుల్లో పగలు ఎక్కువ విద్యుత్ వినియోగం ఉంటుంది. కానీ, వేసవి వచ్చేసరికి పగలు రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ వినియోగం ఒకేలా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల విద్యుత్ వినియోగం రెట్టింపయ్యే అవకాశం వుంది. జిల్లాలో 22,45,103 మంది జనాభా ఉన్నారు. నివాస గృహాలకు సంబంధించి 5,94,049 విద్యుత్ కనెక్షన్లు, కమర్షియల్ విభాగంలో 63,436, చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు సంబంధించి 56,826 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 509 మిలియన్ యూనిట్లు (ఎంయూ), మార్చిలో 544 మిలియన్ యూనిట్లు, ఈ నెలలో 16 రోజులకు గాను 521 ఎంయూ విద్యుత్‌ని వినియోగించారు. మిగతా 14 రోజులకు సంబంధించి మరో 400 మిలియన్ యూనిట్లు, మొత్తంగా ఏప్రిల్‌లో 900 ఎంయూ విద్యుత్‌ను ఉపయోగించే అవకాశం ఉంది. మే నెలలో ఈ వినియోగం ఇంకా పెరగనుంది, వేసవిలో ఏసీలు, కూలర్ల వినియోగం ఎక్కువగా ఉండడంతో విద్యుత్ ఖర్చు పెరుగుతోంది.



డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా..

పెరిగిన విద్యుత్ కనెక్షన్లు, వాటి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. వేసవిలో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. అయినా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అనవసరంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగించవద్దు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వినియోగదారులు ఎక్కువ విద్యుత్‌ను వినియోగించకుండా చూసుకోవాలి.

-ఎం.లక్ష్మణరావు,
సూపరింటెండెంట్ ఇంజనీరు,
ఏపీఈపీడీసీఎల్, విజయనగరం

ఐపీఎల్‌లో జిల్లా ప్రాతినిధ్యం ఉండాలి

7లో

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

7లో

మారికను అదానీకి అప్పగించవద్దు

- గిరిజనుల ఆందోళన
- నేడు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

7లో



బావిలో దూకి..

- తల్లీకుమార్తె ఆత్మహత్య
- శ్రీకాకుళం మండలం గూడెంలో విషాదం
- ఇటీవల అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి
- విశాఖ ఐదో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు
- డెంకాడ నుంచి స్వగ్రామానికి వెళ్లి ప్రాణాలు తీసుకున్న వైనం

శ్రీకాకుళం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల కిందట ఓ బాలిక విశాఖ జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తాజాగా ఆ బాలిక అమ్మ, అమ్మమ్మ (తల్లీకుమార్తెలు) శ్రీకాకుళం మండలం గూడెంలో ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైంది. తల్లీకుమార్తెలిద్దరూ మెడకు చున్నీ బిగించుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం ఆదివారం ఉదయం వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం మండలం గూడెం గ్రామానికి చెందిన మోది సావిత్రమ్మ(55), ఈమె కుమార్తె ఈదల వరలక్ష్మి(32) శనివారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తల్లీకుమార్తెలిద్దరూ 15 ఏళ్ల కిందట గూడెంలో ఇంటిని విక్రయించి.. ఉపాధి కోసం విజయనగరం జిల్లా డెంకాడ వెళ్లిపోయారు. వరలక్ష్మికి 12ఏళ్ల కిందట శ్రీనివాస్ అనే వ్యక్తితో వివాహం కాగా.. ఈ దంపతులకు పూర్ణచంద్రిక(11) అనే కుమార్తె ఉంది. చిన్న చిన్న తగాదాల కారణంగా నాలుగేళ్ల నుంచి శ్రీనివాస్, వరలక్ష్మి వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో వరలక్ష్మి తన తల్లి సావిత్రమ్మతో కలిసి డెంకాడలో చీకులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి వద్దనే ఉంటున్న బాలిక పూర్ణచంద్రికకు ఈ నెల 24న దెయ్యం పట్టిందని.. ప్రార్థనలు చేయించేందుకు విశాఖ జిల్లా జ్ఞానాపురంలో చర్చికి సావిత్రమ్మ, వరలక్ష్మి తీసుకువెళ్లారు. అక్కడ అనుమానాస్పద స్థితిలో పూర్ణచంద్రిక మృతి చెందింది. ఈ ఘటనపై శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాఖ ఐదో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.



వరలక్ష్మి (ఫైల్)



వరలక్ష్మి మృతదేహం



బావిలో నుంచి సావిత్రమ్మ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

- ఇదిలా ఉండగా.. డెంకాడ నుంచి సావిత్రమ్మ, వరలక్ష్మి తమ స్వస్థలమైన గూడెం గ్రామానికి శనివారం వెళ్లారు. వారిద్దరూ రాత్రివేళ మెడకు చున్నీ బిగించుకుని ఓ బావిలో దూకేశారు. ఆదివారం వేకువ జామున మృతదేహాలు నీటిపై తేలుతుండటంతో విషయం బయటపడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది వచ్చి.. మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వాటిని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు శ్రీకాకుళం రూరల్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ రాము తెలిపారు. జ్ఞానాపురంలో బాలిక అనుమానాస్పదస్థితిలో మృతిచెందడం.. ఆ తర్వాత పరిణామాలతో సావిత్రమ్మ, వరలక్ష్మి ఆందోళన చెంది.. ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తల్లీకుమార్తె మృతితో గూడెం గ్రామంలో విషాదం అలుముకుంది.

ముందే వచ్చిన పుస్తకాలు

- జిల్లాకు చేరిన 3,21,757 పాఠ్య, నోట్ బుక్‌లు
- మండలాలకు పంపిణీ
- మిగిలినవి త్వరలో రాక

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి. ఇప్పటికే 3,21,757 పుస్తకాలు చేరాయి. పాఠశాలల పునః ప్రారంభం కాకముందే పాఠశాలలకు పుస్తకాలను చేరవేయాలని లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గత ఐదేళ్లు గాడి తప్పిన విద్యా రంగాన్ని గాడిలో పెట్టేందుకు అడుగులు వేస్తుంది. ఇప్పటికే విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకు వచ్చింది. ఉపాధ్యాయులకు గత ప్రభుత్వ హయాంలో ఉన్న యాప్‌లు భారాన్ని తగ్గించింది. ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించడం కోసం కార్యాచరణ తయారు చేసింది. వేసవి సెలవుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అలాగే విద్యార్థులకు అందజేసే మధ్యాహ్నం భోజనం పథకం మెనూలో కూడా మార్పులు తీసుకుని వచ్చింది. గతంలో పాఠ్య, నోట్ పుస్తకాలు సకాలంలో చేరకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఆ పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పాఠ్య, నోట్ పుస్తకాలను సకాలంలో విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో 1,795 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిల్లో 1,17,839 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 9,05,649 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటి వరకూ 1,44,093 పుస్తకాలు జిల్లాకు చేరాయి. వీటిని ఆరు మండలాలకు పంపిస్తున్నారు. అలాగే, నోట్ పుస్తకాలు 7,88,900 అవసరం కాగా, 1,77,664 పుస్తకాలు జిల్లాకు చేరాయి. వీటిని నాలుగు మండలాలకు చేరవేస్తున్నారు. అక్కడ నుంచి స్కూళ్లకు చేర వేయనున్నారు. పాఠశాలలు పునఃప్రారంభించే లోగా అన్ని పుస్తకాలు పాఠశాలలకు పంపించనున్నారు. మిగిలిన కిట్లు వచ్చిన వెంటనే కొత్త విద్యా సంవత్సరంలో అడుగు పెట్టే విద్యార్థులకు అందిస్తారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పుస్తకాలను సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు పరిశీలించారు. పుస్తకాలను భద్రత పరచాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.



జిల్లా కేంద్రానికి వచ్చిన పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ

ఐపీఎల్‌లో జిల్లా ప్రాతినిథ్యం ఉండాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్‌లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆది వారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులతో కలిసి ఆయన విజ్జీ క్రీడా మైదానంలో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం పక్క జి ల్లాల వారితో పాటు జిల్లాలోని పేదలకు విద్యనందించిన చరిత్ర పూస పాటి అశోక్ గజపతిరాజు కుటుంబానిది అన్నారు. రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా సౌకర్యాలు కల్పించిన ఘనత కూడా ఆ కుటుంబానిదేనన్నారు. మైదానం, క్రీడా సౌకర్యాలను వినియోగించుకుని ప్రతిభ గల క్రీడాకారులుగా తయారు కావాలన్నారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఐదేళ్లల్లో క్రీడలను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అందుకే ఈ మైదానానికి ఐదేళ్లు రాలేదన్నారు. కొండ వెలగాడలో రూ.50 లక్షలతో అంతర్జాతీయ సౌకర్యాలతో జిమ్ నిర్మిస్తే ఆ జిమ్‌లోని మెటీరియల్‌ను తీసుకువెళ్లిపోయారన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా క్రీడలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం అనుభవిస్తున్నామంటే అది అశోక్ గజపతిరాజు చలవేనన్నారు. చరిత్ర కలిగిన మైదానం విజ్జీ క్రీడామైదానమని దానిపేరు నిలబెట్టే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాంబాబు, క్రీడాకారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడాకారుడికి ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

కస్తూర్బా విద్యార్థులకు ఇన్‌చార్జి మంత్రి అభినందనలు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత ఎక్స్‌లో అభినందించారు. కస్తూర్బా విద్యార్థినులు మట్టిలో మాణిక్యాలుగా రాణిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో పదో తరగతిలో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై కలెక్టర్ అంబేడ్కర్, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావులను అభినందించారు.

నితీష్‌కుమార్ రెడ్డిని కలిసిన రాము

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ బ్యాట్స్‌మెన్ నితీష్‌కుమార్‌రెడ్డిని పూసపాటిరేగ టీడీపీ నాయకుడు మూల రాము విశాఖలోని ఆయన నివాసంలో కలిసి అభినందించారు. త్వరలోనే వరల్డ్ కప్‌లో ఆడాలని ఆకాంక్షించారు.

మాజీ సైనికుల నిరసన

విజయనగరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్ర దాడులకు నిరసనగా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చడాన్ని ఖండించారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, వివేకానంద, మనోహర్, సూర్యనారాయణ ఉన్నారు.

●భోగాపురం: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని మారుతీ వికలాంగుల సంఘం ఖండించింది. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం నివాళులర్పించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో రామిశెట్టి చిన్నారావు, బట్టా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దాడిని పట్టణంలోని మోక్షవిద్య యోగా మందిర్ నిర్వాహకులు ఖండించారు. ఆదివారం యోగా మందిర్‌లో ఆసనాల ద్వారా ఉగ్రదాడి బాధితులకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు తదితరులున్నారు.

చిన్నారులకు కవితల పోటీ

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ స్వగృహంలో ఆదివారం విజయనగరం రీడ్స్ ఆధ్వర్యంలో చిన్నారులకు కవితా పోటీలు నిర్వహించారు. చిన్నారుల కవితలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రేపల్లి ఈశ్వరరావు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

వాసవీమాత చరిత్రపై అవగాహన

జామి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన జామిలో ఆదివారం ఆర్యవైశ్య కుల దైవం పెనుగొండ వాసవీమాత చరిత్రపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సును జామి వాసవీ యూత్ అధ్యక్షుడు సతీష్ నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగుళూరు నుంచి వచ్చిన అవధాని వేమ సుబ్రహ్మణ్య గుప్త ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం అమ్మవారి చరిత్రపై నిర్వహించిన పరీక్షలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాసవీ సంఘ రాష్ట్ర ప్రతినిధులు కె.వెంకటరావు, ఆదిమూలం రత్నావతి, గుప్తా, రామయ్య పరీక్షలో విజేతలకు రూ.లక్ష విలువైన బహుమతులు, మెమెంటోలు అందజేశారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

శృంగవరపుకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించనున్నామని గ్రంథాలయ అధికారి డి.శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు వినడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, చెస్, క్యారమ్స్, జీకే నేర్పించనున్నామన్నారు.

శృతిసారణిని అభినందించిన ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కర్నాటక సంగీతగాయని వంకాయల శృతి సారణికి ఆలిండియా రేడియో భక్తి సంగీత గానంలో ఎ-గ్రేడు హోదా సాధించిన సందర్భంగా ఆమెను సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా శృతిసారణి మాట్లాడుతూ తాను కర్ణాటక సంగీతాన్ని ప్రొఫెసర్ కె.సరస్వతి, ఎంఎస్ఎన్ మూర్తిపర్యవేక్షణలో శిక్షణ పొందినట్టు తెలిపారు.

నాటక పోటీల కరపత్రం విడుదల

గరివిడి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలో శ్రీరామ్ హైస్కూల్‌లో మే 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఉభయ రాష్ట్రాల నాటక పోటీల కరపత్రాలను నిర్వాహకులు ఆదివారం విడుదల చేశారు.కార్యక్రమంలో నిర్వాహకులు వాకాడ గోపీ, కంబాల శివ, ఎం.జగన్నాథ రాజు, ఉప శ్రీను, బమ్మిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటాం

విజయనగరం క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అగ్నిమాపక శాఖ విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటామని ప్రాంతీయ అగ్నిమాపకశాఖాధికారి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ కార్యాలయ ఆవరణలో విశ్రాంత ఉద్యోగుల సంఘానికి ఒక గదిని కేటాయించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. శ్రీకాకుళం జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జె.మోహనరావు మాట్లాడుతూ విధుల్లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి విశ్రాంతి పొందుతున్న అగ్నిమాపక సిబ్బందికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. హౌసింగ్ సొసైటీ నగదును విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకశాఖాధికారి రామ్‌ప్రకాష్, అగ్నిమాపకశాఖ అధికార సంఘ అధ్యక్షుడు సీతారామరాజు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాంతీయ అగ్నిమాపక అధికారి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

రాజాం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయడానికి అందరు కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు పిలుపునిచ్చారు. ఆదివారం తృప్తి రిసార్ట్‌లో నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం చేస్తోందన్నారు. ఈ విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, సీనియర్ నాయకులు పీవీజీ కృష్ణంరాజు, సహాయ కార్యదర్శి కాకర్ల సత్యనారాయణ, గుడివాడ నాగరాజు, సామంతుల రమణనాయుడు. చందనపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

‘పాడుదామా స్వేచ్ఛాగీతం’ పుస్తకావిష్కరణ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సాహితీవేత్త గంటేడ గౌరినాయుడు రాసిన ‘పాడుదామా స్వేచ్ఛాగీతం’ పుస్తకాన్ని ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, విశిష్ట అతిథిగా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఎంతో మంది కవులు, కళాకారులు, సాహితీవేత్తలు విజయనగరం కీర్తిని నలుదిశలా వ్యాపింప జేశారన్నారు. గురజాడ, చాసో వంటి వారు సాహితీ రంగంలో చేసిన సేవ నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. గంటేడ గౌరినాయుడు రాసిన 203 పాటల పుస్తకాన్ని ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చీకటి దివాకర్ తీసుకురావడం ప్రశంసనీయమన్నారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయ నగరం కళలకు కాణాచిగా ఉందన్నారు. సాక్షాత్తూ ప్రధాని మోదీ కూడా గురజాడ దేశభక్తి గీతాన్ని ప్రస్తావించడం ఎంతో ఆనందం కలిగిందన్నారు. ప్రముఖ రచయిత, విశ్లేషకుడు తెలకపల్లి రవి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ప్రముఖుల జయంతులు, వర్ధంతుల జాబితాలో మహాకవి గురజాడ పేరు లేకపోవడం ఎంతో బాధ కలిగించిందన్నారు. అనంతరం రచయిత గంటేడ గౌరినాయుడు మాటాడారు. కార్యక్రమంలో వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, డాక్టర్ జి.సన్యాసమ్మ, చీకటి రవితేజ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

సత్సంగంతో ఉన్నత స్థితికి..

రేగిడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సత్సంగాలతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చుని పాలకొండకు చెందిన సత్యసాయి సేవాసమితి ప్రతినిధి ఎన్‌వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతాశ్రమంలో ఆదివారం దివ్యజీవన సత్సంగం నిర్వహించారు. ఆశ్రమ కన్వీనర్ గొర్లె దామోదర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో ఎన్‌వీ రమణతో పాటు సామంతులు దామోదర్, కె.కృష్ణారావు, త్రినాథరావు, ఆర్ చిన్నంనాయుడు, కోట ఉమామహేశ్వరరావు, మామిడి శివ, కిమిడి సూరపనాయుడు తదితరు పాల్గొని మాట్లాడారు. అంతకముందు భగవద్గీత లోని ముఖ్య ఘట్టాలపై చర్చ, గీతాపారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవుదళ, పుర్లి, గోపేంపేటలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఆదివారం డాక్టర్‌కు సెలవు

●స్టాఫ్‌నర్సే రోగులకు దిక్కు



విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్స్

జామి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పీహెచ్‌సీకి ఆదివారం డాక్టరు హాజరు కాలేదు. దాంతో స్టాఫ్‌నర్సే రోగులకు సేవలు అందించారు. ఇక్కడ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండగా కొద్దినెలల కిందట ఒకరు అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లు చెరో 12 గంటల పాటు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ఇక్కడ మరో వైద్యుడి నియామకం చేపట్టాల్సి ఉంది.

మత్స్యకారుల దశ మారింది: కళా

రాజాం/చీపురుపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల దశ మారిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారుల సేవలో పథకాన్ని సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభించడం హర్షణీయమన్నారు. వేట నిషేధ భృతిని రెట్టింపు చేశారన్నారు. దానివల్ల రాష్ట్రంలో 1, 29,178 మంది మత్స్యకారులకు రూ. 259 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గత ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క మత్స్యకార కుటుంబం కూడా బాగుపడలేదన్నారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, చేపల ఎగుమతిల్లో మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఏపీ నుంచి 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా రూ 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని కళా వివరించారు.



ఎమ్మెల్యే కళావెంకటరావు

చంద్రబాబుతో సంక్షేమం

రాజాం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం, వారి జీవన ప్రమాణాలను పెంపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే మత్స్యకారులకు ఇచ్చిన వాగ్దానాన్ని చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10వేలు నుంచి 20 వేలు చేశారన్నారు. 2014లో తొలిసారిగా టీడీపీ ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతిని అమలు చేసిందని ఆయన వివరించారు.



ఎమ్మెల్యే మురళీమోహన్

ఫిష్ ఆంధ్రాతో ఒరిగిందేమీలేదు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫిష్ ఆంధ్రాతో ఏ ఒక్క మత్స్యకార కుటుంబానికి మేలు జరగలేదని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు విమర్శించారు. దానివల్ల మత్స్యకారులకు, మత్స్యకార కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. ఆదివారం ఎమ్మెల్యే పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులు, వారి కుటుంబాలకు అధిక ప్రయోజనం చేకూర్చే చర్యలు ప్రారంభించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ భృతిని రూ.20 వేలు ఇస్తోందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లి మరణిస్తే సదరు మత్స్యకారుడి కుటుంబానికి రూ 10 లక్షల ఆర్థిక సాయం, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



ఎమ్మెల్యే అదితి

భృతి రెట్టింపు ఘనత ప్రభుత్వానిదే

భోగాపురం, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందని నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారుల వేట నిషేధ భృతిని రెట్టింపు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో 1,29, 178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి డి.భూలోక, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంగార్రాజు

నెమ్మి నీలం కథలపై ప్రసంగం

రాజాం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాడార్లు, నాయాడులు వంటి అట్టడుగు ప్రజలపై అగ్రవర్ణాల వివక్షకు ప్రతిబింబమే నెమ్మి నీలం కథలు అని ప్రముఖ సాహితీవేత్త పొదిలాపు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 123వ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన నెమ్మి నీలం కథలు-ఒక పరిశీలన అంశంపై ముఖ్య ప్రసంగం చేశారు. చారిత్రక నేపథ్యాన్ని, సమాజంలో వారి స్థాయిని వివరించే కథలు ఇందులో ఉన్నాయన్నారు. 12 కథలలోనూ మానవత్వం, ఆకలి, నల్ల రంగు ముఖ్యభూమిక పోషిస్తాయన్నారు. వీటిని అద్భుతంగా కథకుడు రాశారన్నారు. మూడడ్ల శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, నూతేటి గణేశ్వరరావు, రౌతు గణపతిరావు నాయుడు, ఆల్తి మోహనరావు, పెంకి చైతన్యకుమార్, కుదమ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త పొదిలాపు

న్యాయాధికారి వాణికి సత్కారం

శృంగవరపుకోట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట కోర్టు న్యాయాధికారి సబ్బవరపు వాణిని ఆదివారం స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఎస్.కోట నుంచి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట కోర్టుకు బదిలీపై వెళ్తుండటంతో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, న్యాయవాదులు గేదెల ప్రకాశరావు, డబ్ల్యూఎన్ శర్మ, వారాది ఈశ్వరరావు, బొబ్బిలి రామకృష్ణ తదితరులున్నారు.



న్యాయాధికారిని సత్కరిస్తున్న దృశ్యం

మారికను అదానీకి అప్పగించవద్దు

●గిరిజనుల ఆందోళన
●నేడు తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

వేపాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలస గ్రామ శివారు మారిక గిరిజన గ్రామంలో అదానీ పవర్ ప్లాంట్ నిర్మాణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో వారు ఆందోళన చేపట్టారు. మారిక గ్రామాన్ని అదానీ కంపెనీకి అప్పగించవద్దని నినాదాలు చేశారు. అదానీ సిబ్బంది, అధికారులు మారిక గ్రామానికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. పోరాటంలో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి జిల్లా అధికారులు అదానీ గ్రూపునకు మేలు చేయడానికి యత్నించడం అన్యాయమన్నారు. ఆందోళనలో సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, జలారీ వీర్రాజు, కిలో ఆనంద్, గమ్మెల బాబూరావు, గమ్మెల అప్పలనాయుడు, బొబ్బిలి గణేష్, వెంకటరావు, శ్రీను, ఆసు కృష్ణ, అర్జున్ తదితదరులతో పాటు పాత, కొత్త మారిక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మారిక గిరిజనులు

కారు, వ్యాన్ ఢీ: ఒకరి మృతి

దత్తిరాజేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరడాం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున కారు, వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న కోళ్ల వ్యాను ఎదురుగా పార్వతీపురం నుంచి విజయనగరం వైపు వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ పల్లి సురేష్‌బాబు(42) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నానికి చెందిన వాడిగా గుర్తించారు. ఆయనతో పాటు కారులో ప్రయాణిస్తున్న కొమ్మనపల్లి బుజ్జి, తుపాకుల సుబ్బారావు, తుపాకుల వెంకటేశ్వరరావులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని విజయనగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులంతా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారేనని, స్థానికంగా జీడిపిక్కల వ్యాపారం చేస్తుంటారని ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

ఇరువర్గాల కొట్లాట: కేసు నమోదు

సంతకవిటి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ల సీతా రాంపురంలో శనివారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. కొట్లాట ఘటనకు సంబంధించి పోలీసుల వివరాలకు మేరకు.. 15 రోజుల కిందట పక్క పక్క పొలాల్లో ముగడ సూర్యనారాయణ గట్టుపై ఉన్న చెట్టును కొల్లి మురళీ కొట్టేశారు. దాంతో ఇరువురు కుటుంబాల మధ్య మాటామాటా పెరిగి శనివారం రాత్రి కొట్లాట జరిగింది. కొట్లాటలో 9 మంది గాయాల పాలయ్యారు. గాయపడిన ముగడ గణేష్ విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ముగడ సూర్యనారాయణ, రామకృష్ణ, సత్యం, బంగార్రాజు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో... కొల్లి శ్రీను, కొల్లి పవన్, కొల్లి మణికంఠ రాజాంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ముగడ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13 మందిపై, కొల్లి పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఐ ఉపేంద్ర, ఎస్ఐ గోపాలరావు విచారించారు.



క్షతగాత్రులతో మాట్లాడుతున్న సీఐ

మహిళ అదృశ్యం

సంతకవిటి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండవ కురిటికి చెందిన బత్తుల గోవిందరావు తమ కుమార్తె అదృశ్యమైందని ఆదివారం సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలసి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. గోవిందరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపాలరావు కేసు నమోదు చేశారు.

కారు బోల్తా: ఒకరికి తీవ్ర గాయాలు

సంతకవిటి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన మీసాల మహేశ్, ఆయన భార్య రాధ, కుమార్తెలు హారిక, ఉద్విత ఆదివారం తిరుపతిలో ప్రమాదానికి గురయ్యారు. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు టైర్ పంక్చర్ అయింది. దాంతో కారు బోల్తా పడింది. ప్రమాదంలో హారిక తలకు బలమైన గాయమైంది. తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్పించారు. ప్రమాదంలో మహేష్, రాధ, ఉద్వితులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు.



ప్రమాదానికి గురైన వాహనం

పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ధర్మపురిలో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బంది దాడి చేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 27 ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో ఆదివారం జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, లాడ్జిలు విస్తృతంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎక్విప్‌మెంట్‌తో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రవేశించే ప్రధాన మార్గాలు, సరిహద్దు జిల్లాలకు వెళ్లే ముగింపు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు వద్ద పోలీసు బృందాలు సోదాలు చేశాయి.. ఆకస్మిక తనిఖీలను డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యరెడ్డి, రాఘవులు పర్యవేక్షించారు.



లాడ్జిలో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

రేపు గీతంలో ఉద్యోగ మేళా

శృంగవరపుకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) విశాఖలోని గీతంలో ఈనెల 29న నిర్వహించనున్న ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ కోరారు. ఆదివారం ఎస్.కోటలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమర్‌రాజా కంపెనీ ప్రతినిధులు మేళాకు హాజరు కానున్నారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ చదవుకున్న 18 నుంచి 35 ఏళ్లలోపు స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. విద్యార్హతను బట్టి 12 నెలల నుంచి 24 నెలల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో రూ. 12,500 నుంచి రూ.15 వేల వరకు స్టైఫండ్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం రూ.22 వేల జీతం ఉంటుందన్నారు. ఉచిత వసతి, రాయతీతో భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో రాయవరపు చంద్ర శేఖర్, లగుడు రవికుమార్, గొంప వెంకటరావు, జుత్తాడ రామసత్యం, మాదిబోయిన మంగరాజు తదితరులున్నారు.

నేడు ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నైరడ్‌లో ఉచిత శిక్షణకు సోమవారం నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి గలవారు హాజరుకావాలని ఏవో నాగరాజు ఒక ప్రకటనలో కోరారు. పురుషులకు కంప్యూటర్ ట్యాలీ అండ్ బేసిక్స్ 38 రోజులు, బైక్ రిపేరింగ్ 30 రోజులు, జెంట్స్ టైలరింగ్ 31 రోజులు హౌస్ వైరింగ్ 30 రోజులు, స్త్రీలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ 35 రోజులు, లేడీస్ టైలరింగ్ 31 రోజులు, మగ్గం వర్క్ అండ్ శారీ పెయింటింగ్ వర్క్స్ 31 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫాం, టూల్ కిట్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

పోరాటానికి సిద్ధం

చీపురుపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో యుద్ధం అనివార్యమైతే, దేశం తరపున యుద్ధంలో పాల్గొనడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని పునర్నియామక మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యు =డు కాపరోతు మురళీధర్ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. సర్వీసులో ఉన్న వారి సెలవులు రద్దు చేసుకుని విధుల్లో చేరమని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అవసరమైతే తాము కూడా యుద్ధరంగంలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తమ సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్యామలాంబ పండగను విజయవంతంగా నిర్వహించాలి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



శ్యామలాంబ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సంధ్యారాణి

సాలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండగను విజయవంతంగా నిర్వహించాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆదివారం పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచాలని, భక్తుల దర్శనానికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఆమె వెంట ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు(చిట్టి), కేతిరెడ్డి చంద్రశేఖర్‌తోపాటు పలువురు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి



మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి తెలిపారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ప్రభుత్వ సాయాన్ని రూ.10 వేలు నుంచి రూ.20 వేలుకు పెంచినట్లు తెలిపారు. గతంలో వృద్ధులకు పింఛన్ రూ.3 వేలు నుంచి రూ.4 వేలు పెంచినట్లు చెప్పారు. సమావేశంలో పాడి సుధ, పోలూరి శ్రీనివాస్, తులాల రవి, శొంఠ్యాన రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

పాలకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించానికి సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనట పేర్కొన్నారు. జూన్ ఆరో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు తయారు, పేపర్ క్రాఫ్ట్, ఆటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● బాడంగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ ఆరో తేదీ వరకు 40 రోజులపాటు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించనునుట్టు గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రతీరోజో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామని, ఈ మేరకు విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)నిర్వహించనున్నట్లు ఐటీడీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు సీతంపేటలో వైద్యశిబిరం

సీతంపేట రూరల్,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):సీతంపేటలో సత్యసాయి బాబా సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సేవాసమితి సభ్యులు పకీరునాయుడు,నర్సింహులు,రామకృష్ణ తెలిపారు. మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచిత ప్రవేశాలకు సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు దత్తి అప్పలనాయుడు, కె.కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టంలో భాగంగా ఐదు నుంచి ఆరు సంవత్సరాలు గల వారు ఉచిత ప్రవేశాలకు మే 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లును కేటాయించనున్నట్లు తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు పూర్తిస్థాయి సమాచారాన్ని పొందుపరచాలని కోరారు. నిబంధనల మేరకు సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

వీరఘట్టం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిమ్మిలో సోమవారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ధర్మకర్త కోడి వాసుదేవరావు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వేలాదిమంది సాయుధబలగాలతో కూంబింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. రెండుమూడు రోజులుగా పోలీసులు అనుమానితులు కనిపిస్తే వారిని ప్రశ్నిస్తున్నారు.గతంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉండేది. అయితే ప్రస్తుతం కార్యకలాపాలు పూర్తిగాతగ్గినా, పోలీసులకు ఉన్నతాధికారులు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఏవోబీ నుంచి వచ్చిపోయే వాహనాలకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద 24 గంటలు తనిఖీచేస్తున్నారు.

అడుగంటిన చెరువులో చేపల వేట

మక్కువ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం, కొండబుచ్చిపేట, కవిరిపల్లి, అరసభద్ర తదితర గ్రామాల్లో చెరువులు అడుగంటిపోయాయి. ఈ ఏడాది వెంగళరాయసాగర్ జలాశయం నుంచి కూడా రబీకి నీటిని విడిచిపెట్టలేదు.ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రతకు చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరు అడుగంటిపోతోంది. దీంతో భూగర్భ జలాలపై ప్రభావం పడుతుందని ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో మే జూన్ నెలల్లో భూగర్భ జలాలు ఇంకిపోయి తాగునీటికి కటకట తప్పదన్న పలువురు చెబుతున్నారు. చెరువులు ఎండిపోవడంతో మూగజీవాలకు సైతం తాగునీటికి ఇక్కట్లు తప్పవని పశుపోషకులు వాపోతున్నారు. చెరువులు అడుగంటిపోవడంతో స్థానికులు బురద నీటిని తోడి చేపలు పడుతున్నారు. ఇప్పటికే చెరువుల్లో సాగు చేస్తున్న మత్స్యకారులు వలలతో చేపలు పట్టి మార్కెట్‌కు తరలించిన విషయం విదితమే.



కొండబుచ్చిపేట చెరువులో చేపలు పడుతున్న గ్రామస్థులు



ఎమ్మార్సీ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు

నిర్వహణ లేక..శిథిలావస్థకు చేరి

● సిబ్బంది, ఉపాధ్యాయులకు తప్పని అవస్థలు

● ఇదీ ఎమ్మార్సీలో మరుగుదొడ్ల పరిస్థితి

గరుగుబిల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి ఎమ్మార్సీలోని మరుగుదొడ్లు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. 15 ఏళ్ల కిందట నిర్మించిన మరుగుదొడ్లకు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో వినియోగంలోకి లేకుండాపోయాయి.దీంతో ఇక్కడ కార్యక్రమాల నిర్వహణ సమయంలో 56 పాఠశాలల నుంచి వచ్చే ఉపాధ్యాయులతోపాటు, ఎమ్మార్సీ సిబ్బంది అవస్థలకు గురవుతున్నారు.దీంతో బయట ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోంది. ఏళ్ల తరబడి వృథాగా విడిచిపెట్టడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదముందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.దీనికితోడు మరుగుదొడ్లకు అనుకుని నిర్మించిన ట్యాంకువద్ద పెద్దగొయ్యి ఏర్పడింది.దీంతో అటుగా వెళ్లే సమయంలో జారి పడిపోయే అవకాశముందని ఎమ్మార్సీసిబ్బంది భయపడుతున్నారు. అలాగే ఎమ్మార్సీ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. కార్యక్రమాల నిర్వహణకు ఆటంకాలు నెలకొంటున్నా మరమ్మతులకు ఉన్నతాధికారులు దృష్టి సారించని పరిస్థితి నెలకొందని విమర్శలొస్తున్నాయి. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతలు ముందుకువచ్చి కొంతమేర మరమ్మ తులు చేపట్టారు. కాగా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేశామని ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు.



బొబ్బిలి/రూరల్: మౌన ప్రదర్శన నిర్వహిసున్న ఫ్లవర్ డెకరేషన్, లైటింగ్, డీజే సౌండ్స్ ప్రతినిధులు



వీరఘట్టం: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోండి

● ఉమ్మడి జిల్లాలో ర్యాలీలు

జమ్మూకాశ్మీర్‌లో పెహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని పలుసంఘాలు కోరాయి. ఈ మేరకు ఆదివారం ఉమ్మడి జిల్లాలో కొవ్వొత్తుల, మౌన ప్రదర్శన నిర్వహించారు.

●వీరఘట్టం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):వీరఘట్టంలో పెహల్గాంలోజరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. కార్య క్రమంలో భోగి మణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●బొబ్బిలి/రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో ఆదివారం ఎన్టీఆర్ బొమ్మ, కోట చుట్టూ పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతులకు ఫ్లవర్ డెకరేషన్, లైటింగ్, డీజే సౌండ్స్ సంక్షేమ సంఘం, సమరతా సేవా సంస్థ, హనుమాన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంఘీభావంగా మౌన ప్రదర్శన చేశారు.కార్యక్రమంలో యెన్నా బాబు, దిబ్బ లోకేష్, పతవాడ కృష్ణ, పల్లూరి శ్రీను, కర్రి రామమూర్తి, సూర్యారావు, పూర్ణ, హేమంత్ కుమార్, ప్రసాద్, కోనపల వెంకటరమణ, బోటు రవి, పొట్టేలు రవి హనుమాన్, సమరసత సేవా సంస్థ ధూపం వాసు, వనమిత్ర కృష్ణదాస్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు వస్తున్నాయ్

(ఐదో పేజీ తరువాయి)

వితంతు మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారు ఒక్క సంతకవిటి మండలంలోనే సుమారు 50 మందికి పైగా ఉండగా, జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నారు. తమకు కూడా స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోవచ్చు..

జిల్లావ్యాప్తంగా వితంతువులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.ప్రభుత్వం అనుమతిచ్చింది. జిల్లావ్యాప్తంగా 4,800 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సరైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. భర్తమరణ ధ్రువీకరణపత్రంతో పాటు ఇతర వివరాలు అందించాలి. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే పింఛన్ తప్పకుండా మంజూరవుతుంది.

-కల్యాణచక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం

రేపు అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం

బొబ్బిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మునిసిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావుపై అవిశ్వాసం తీర్మానంపై మంగళవారం ఓటింగ్ కోసం ప్రత్యేక సమావేశం జరగనుంది. దీంతో ఇప్పటివరకు నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. అవిశ్వాసం తీర్మానానికి సంబంధించి 20 మంది కౌన్సిలర్లు కలిసి కలెక్టరుకు ఇచ్చిన నోటీసులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, దీనిపై స్టే విధించాలని వైసీపీ నాయకులు హైకోర్టులో కేసు వేయగా, దీనిపై సోమవారం కోర్టు తన అభిప్రాయాన్ని వెల్లడించనుంది. అవిశ్వాసానికి సంబంధించి ఇచ్చిన నోటీసుల్లో నిర్ణీత ఫారమ్‌లపై సంతకాలు లేవని, తేదీలు కూడా లేవన్నది వైసీపీ అభ్యంతరం తెలియజేసింది. దీనిని పరిగణనలోనికి తీసుకొని అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన సమావేశంపై స్టే విధించాలని వైసీపీ వాదన.ఈ నేపథ్యంలో వైసీపీ కౌన్సిలర్లందరికీ ఆ పార్టీ విప్ జారీ చేసింది. టీడీపీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లను తమ వైపు లాక్కునేందుకు వైసీపీ అన్ని రకాల అస్త్రాలను ప్రయోగిస్తుండడంతో టీడీపీ అప్రమత్తమైంది. తమ పార్టీకి చెందిన పదిమంది కౌన్సిలర్లను ఆదివారం హుటాహుటిన ప్రత్యేక శిబిరానికి తరలించినట్లు తెలిసింది. మంగళవారం జరగనున్న అవిశ్వాసం సమావేశానికి నేరుగా మునిసిపల్ కార్యాలయానికి తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన సమ్మతి, అసమ్మతి కౌన్సిలర్లు మొత్తం వేర్వేరుగా రహస్య శిబిరాల్లో ఉంచిన సంగతి తెలిసిందే. అవిశ్వాసంపై సోమవారం హైకోర్టు నుంచి ఎటువంటి తీర్పు వెలువడుతుందోనని మూడు శిబిరాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సోమవారం వెలువడే తీర్పు పర్యవసానంగా మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఆర్డీవో నేతృత్వంలో అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం జరగనుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రామభద్రపురం: ఆనాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకొండ,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):పాలకొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 1988-91లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా వారు చదువుకున్న రోజుల్లోని స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కొట్టిశ రాజశేఖర్, శివశంకర్ ప్రసాద్, జి.అప్పలనాయుడు, ఆదినారాయణ, లలిత, పోలినాయుడు, బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

●రామభద్రపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2004-09లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగంలో స్థిరపడిన వారంతా ఒకదగ్గరకు చేరి ఆనాటి తీపి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయులు ఆర్.నరసింగరావు, మండా ప్రసాదరావు, రామ్‌చంద్రరావు, డాక్టర్ రావాడ భాస్కరరావు, సుజాతలను సన్మానించారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు నిర్వహించండి

తెర్లాం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):ప్రశాంత వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు కోరారు. ఆదివారం నందిగాం గ్రామదేవత పండుగ పురస్కరించుకుని గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.

బాడంగిలో గడ్డికుప్పల దగ్ధం

బాడంగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బాడంగిలోని మరడాన చంద్రినాయుడుకు చెందిన మూడు గడ్డి కుప్పలు, 50 ధాన్యం బస్తాలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఆదివారం గడ్డికుప్పల వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడనిల్వచేసిన 50 బస్తాల ధాన్యం ఖాళీపోయాయి. కాగా స్థానికులు బాడంగి అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

జియ్యమ్మవలస, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రా మాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి కోరారు. ఆదివారం గుమడ సంతలో విలేకరులతో మాట్లా డుతూ తాగునీరు, ఉపాధి బిల్లుల సమస్యలు పరిష్కరించాలని కొమరాడఎంపీడీవో కార్యా లయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని నయ, జల గిరిజన పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మణరావు, కోటి పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని డిప్యూటీ డిఈవో మోహనరావు కోరారు. ఆదివారం బొబ్బిలిలో జన విజ్ఞాన వేదిక, గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం శిబిరంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అనేక అంశాల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం కల్పించడం కోసం చేస్తున్న ఈ ప్రయత్నంలో సఫలీకృతులు కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మూట్నూరు వేణు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి, రిసోర్స్‌పర్సన్ స్వామినాయుడు, గౌరునాయుడు, మల్లేశ్వరరావు, శ్రీనివాసు, ప్రవీణ్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువల సమస్య పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు కాలువసమస్యలపై మే ఆరోతేదీన సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా అయన మాట్లాడుతూ తోటపల్లి ప్రా జెక్టు లక్షా80 వేల ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉండగా నేటికీ పరి ష్కారం కాలేదన్నారు. కాని ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆక్షేపించారు. తోటపల్లి ప్రాజెక్టు పూర్తి అవ్వాలంటే 590 కోట్లు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినా ప్రభుత్వం రూ.47 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించడం సరికాదన్నారు. సమావేశం లో సింహాద్రి, కరణం అప్పారావు, సోమశేఖర్, గంగుల శ్రీనివాసరావు, వెన్నపు చిన్న, నారాయణరావు, మజ్జి చంటిబాబు, శాసపు మన్మథరావు, శాసపు విజయ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం తెర్లాం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యా ర్థుల్లో నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు చదివించడం, పద్యాలు, గద్యాలు పాడించడం, ఆటలు , క్విజ్,వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

పోలియో నిర్మూలనకు చేయూత నివ్వండి

బొబ్బిలి/రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి రోటరీ క్లబ్ పోలియో నిర్మూలనకు నిధుల సేకరణ కార్యక్రమానికి చేయూత నివ్వాలని స్థానిక క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు కోరారు.ఈ మేరకు ఆదివారం బొబ్బిలిలో క్లబ్ అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాస్, కార్యదర్శి ప్రవీణ్‌లు విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు రామకృష్ణ, కృష్ణమోహన్‌లు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

బొబ్బిలి/రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని విశ్రాంత రైల్వే సీనియర్ జనరల్ మేనేజర్ రంపా వెంకట సూర్య రాఘవరావు కోరారు. ఆదివారం బొబ్బిలిలోని కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో మే డేకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పురుషులతో సమానంగా మహిళా కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని డిమండ్ చేశారు.కార్యక్రమంలో ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడుతమటాల అప్పలనాయుడు, కార్యదర్శి రాయితీ సత్యం, ప్రజా కళామండలి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు సింహాచలం పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే చర్యలు

బాడంగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పాల్తేరు వద్ద వేగావతి నది పరివాహక ప్రాంతంలో పరిశీలించారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముత్తావలసలో ఆదివారం షిర్డీ సాయి బాబా ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ స ందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు.

అనుమానాస్పదస్థితిలో గిరిజనుడి మృతి

పాచిపెంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ గిరిజనుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పూలగూడకు చెందిన పోయి అప్పలస్వామి (55) తంగ్లాంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి శుక్రవారం రాత్రి వెళ్లాడు. తంగ్లాం పక్క గ్రామమైన పనసలపాడుకు చెందిన పోయి రాజుతో అప్పలస్వామికి గొడవ జరిగింది. అక్కడ ఉన్న గ్రామస్థులు ఇద్దరికి సర్దిచెప్పి పంపించేశారు. అప్పలస్వామి ఇంటికి రాకపోవడంతో భార్య అప్పలమ్మ అదే రోజు రాత్రి తంగ్లాం వెళ్లేందుకు బయలుదేరింది. మార్గమధ్యలో భర్త అప్పలస్వామి గాయాలతో కింద పడి మృతి చెందిఉన్నాడు. ఈవిషయమై తంగ్లాం గ్రామ పెద్దలకు తెలియజేసి స్థానిక పోలీసులకు అప్పలమ్మ శనివారం ఫిర్యాదుచేసింది. దీంతో ఎస్ఐ వెంకటసురేష్ కేసు నమోదు చేశారు.మృతదేహానికి శవపంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. కాగా అనుమానాస్పదంగా మృతి చెందిన పూలగూడకు చెందిన పోయి అప్పలస్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఒక ప్రకటనలో కోరారు. అప్పలస్వామి మృతిపై దర్యాప్తు నిర్వహించి హత్యక కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.



